క్లుప్తంగా

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరులోని షాదీమంజిల్‌లో డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు హాజరుకావాలని కోరారు.

మద్దతు ధర కల్పించాలని వినతి

నెల్లూరు(పొగతోట): ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పుట్టి రూ.20,187కు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు రాజగోపాల్, మూలి వెంగయ్య, లక్కు ప్రసాద్, జనార్దన్ కోరారు. శుక్రవారం నెల్లూరులో సివిల్ సప్లెస్ సంస్థ డీఎం అర్జున్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 80 శాతం మంది రైతులు తక్కువ ధరలకు ధాన్యం విక్రయించారన్నారు. రూ.200 కోట్లకుపైగా నష్టపోయారన్నారు. ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోతాలను అందుబాటులో ఉంచాలన్నారు.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం


మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో ఓ రైస్‌మిల్లులో శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చిన్నచెరుకూరులో వినోద్‌రెడ్డికి చెందిన జీఆర్ పూజిత రైస్‌మిల్లులోని బాయిలర్‌లో హఠాత్తుగా మంటలు వ్యాపించాయి. పొట్టు కారణంగా మంటలు పెరిగాయి. రూ.50 వేల విలువైన పరికరాలు కాలిపోయినట్లు యజమాని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పూర్తిస్థాయిలో మంటలను అదుపు చేశారు.

కనీస వేతనమివ్వాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలన్నారు. నాణ్యమైన యూనిఫాం, సెల్‌ఫోన్లు అందించాలన్నారు. జనాభాకు అనుగుణంగా వర్కర్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 7వ తేదీన ఆశా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వద్ద ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మధుసూదన, లక్ష్మి, మేరి, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): విజయదశమిని పురస్కరించుకుని వేదాయపాళెం త్యాగరాజనగర్ త్యాగరాజస్వామి మందిరంలో గురువారం రాత్రి ప్రదర్శితమైన విజయ నృత్యాంజలి భరతనాట్యం ప్రదర్శన అలరించింది. శ్రీనారాయణ తీర్థ తరంగిణికి చెందిన ప్రముఖ నృత్య దర్శకురాలు గురు విదుషి చిత్ర అరవింద్ ఆధ్వర్యంలో 15 మంది కళాకారిణులు నాట్య ప్రదర్శన ఇచ్చారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుతాం

- కమిషనర్ వైఓ నందన్



నెల్లూరు(బారకాసు): నెల్లూరును ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తమ వంతు కృషి చేయాలని కమిషనర్ వైఓ నందన్ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ముగింపు కార్యక్రమాన్ని ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్పొరేషన్ పరిధిలో ఒకసారి వాడి పడేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ ఆధారిత వస్తువులను పూర్తిగా నిషేధించినట్లు తెలియజేశారు. పారిశుద్ధ్య కార్మికులకు జ్ఞాపికలు అందజేసి, శాలువాలతో ఘన సన్మానం చేశారు. దసరా సందర్భంగా అన్ని విభాగాల సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వార్డు సచివాలయ కార్యదర్శులను సన్మానించారు. ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, టీపీఆర్వో వాసుబాబు, ఈఈ రహంతు జానీ పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

పొదలకూరు : మండల ప్రజలు దసరా పండగను ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం అమ్మవారు విజయలక్ష్మిగా దర్శనం ఇచ్చారు. శుక్రవారం దర్బారు అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా సహస్రనామార్చన, ఖడ్గమాల, త్రిశతి పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రామనగర్ గేట్ సెంటరులో దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారి విగ్రహాన్ని విశేషంగా అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అలాగే ఇనుకుర్తి గ్రామంలోని అవదూద కాంతమ్మ ఆశ్రమంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకటాచలం: మండల ప్రజలు దసరా పండగను ఘనంగా జరుపుకొన్నారు. కాకుటూరులోని రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, తిక్కవరప్పాడులోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిక్కవరప్పాడులోని రాజరాజేశ్వరి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

తోటపల్లిగూడూరు: మండల వ్యాప్తంగా దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లను విశేషంగా అలంకరించి ఊరేగించారు. వరిగొండలోని


పొదలకూరు: విజయలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు

జ్వాలాముఖి ఆలయం, నరుకూరు ఇందిరాకాలనీలోని రాజరాజేశ్వరీదేవి ఆలయం, పేడూరులోని చాముండేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కోడూరు గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లూరు శేషు,మాధవి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మనుబోలు: మండల వ్యాప్తంగా దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. మనుబోలులోని పోలేరమ్మ ఆలయంలో గురు, శుక్రవారాల్లో అమ్మవారు రాజరాజేశ్వరి, భద్రకాళి అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు అమ్మవారికి పంచామృతాభిషేకం, మహిళలతో సామూహిక


మనుబోలు: రాజరాజేశ్వరీదేవిగా పోలేరమ్మ


టీపీగూడూరు: కోడూరులోని పోలేరమ్మ ఆలయంలో..

కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా గుండుబోయిన శ్రీనివాసులు, వరలక్ష్మి, కయ్యూరు సుధాకర్‌రెడ్డి, సుమతి దంపతులు వ్యవహరించారు.


పొదలకూరులో విశేషాలంకారంలో అమ్మవారు


వెంకటాచలం: తిక్కవరప్పాడులో విశేషాలంకారంలో రాజరాజేశ్వరీదేవి


మనుబోలులో భద్రకాళి అలంకారం

మహాత్ముని జీవితం ఆదర్శనీయం

వెంకటాచలం: మహాత్మా గాంధీ జీవితం ఆదర్శనీయమని విక్రమసింహపురి యూనివర్శిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్శిటీలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి, శాస్త్రి చిత్రపటానికి వీసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ, శాస్త్రి దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ఆదర్శనీయమని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని వాడవాడలా గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శివయ్య ఆధ్వర్యంలో, తోటపల్లిగూడూరు పోలీసు స్టేషన్‌లో ఇన్‌చార్జి వాసు ఆధ్వర్యంలో మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు.

కోవూరు : స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను


వెంకటాచలం: గాంధీకి నివాళులర్పించిన వీసీ అల్లం శ్రీనివాసరావు

ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకష్టారెడ్డి, , జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరేగిరి శ్రీలత, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ దౌలత్, కోవూరు పట్టణ కార్యదర్శి షేక్ గయాజ్, తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని గాంధీ పార్క్ సెంటర్‌లో జనవిజ్ఞానవేదిక, యూటీఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు .


కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..


కోవూరులోని గాంధీబొమ్మ వద్ద..

మల్లికార్జునస్వామి ఆలయానికి నగదు విరాళం

పొదలకూరు : దసరా సందర్భంగా మండలంలోని మరుపూరులోని కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి మరుపూరు వెంకటరమణయ్య జ్ఞాపకార్థంగా సతీమణి, పిల్లలు రూ.50 వేలు నగదును విరాళంగా ప్రకటించారు. ఆలయ చైర్మన్ వేణుంబాక చంద్రశేఖరరెడ్డికి నగదు చెక్కును అందజేశారు.

అలాగే కలిచేటి వెంకటశేషారెడ్డి కుటుంబసభ్యులు పల్లకి, చింతక్రింద గిరి దంపతులు గొడుగులు, జీని దామోదరం దంపతులు ఇన్‌వర్టర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో



సుమంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, యశ్వంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా మహాసభలు రేపు


కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా మహా సభలను ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య తెలిపారు. నార్తురాజుపాళెంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో సంపదను సృష్టించేది వ్యవసాయ రంగమేనన్నారు. అలాంటి వ్యవసాయ రంగం నేడు దీనస్థితిలో ఉందన్నారు. వ్యవసాయ పనులు తగ్గిపోయి కార్మికులు వలసలు పోతున్నారన్నారు. కూలీలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. వంద రోజుల పని కల్పించడంలో విఫలమయ్యాయన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు వేల ఎకరాలు కట్టబెడుతూ నిరుపేద కార్మికులకు సెంటు భూమి ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కోసం ప్రభుత్వం సమగ్ర చట్టం తేవాలని డిమాండ్ చేశారు. యల్లాయపాళెం


మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

లో జరిగే జిల్లా మహాసభల్లో వ్యవసాయ కార్మికులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వంపై చేయాల్సిన పోరాటాలపై సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామన్నారు. జిల్లాలోని వ్యవసాయ కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు పోతుగుంట దేవకుమారి, మండల కార్యదర్శి పీ పరశురామ్, మండలాధ్యక్షులు బీ నాగమ్మ, జిల్లా కమిటి సభ్యులు ఎస్డీ మహబూబ్‌బాషా, సీఐటీయూ మండల కార్యదర్శి టీ నరసింహం పాల్గొన్నారు.

బాణసంచా పేలుడులో గాయపడిన మహిళ మృతి

కోవూరు: బాణసంచా పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన పట్టణంలోని సత్రంవీధికి చెందిన లక్ష్మి(45) అనే మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పట్టణంలోని సత్రంవీధిలో గత నెల 4న గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా బాణసంచా ఒక్కసారిగా పేలడంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మి చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో సత్రంవీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో యువకుడు రాజస్థాన్‌కు చెందిన రామ్‌దేవ్‌బాబా గత 14న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే.


లక్ష్మి(ఫైల్)

రామమందిరం నిర్మాణానికి శంకుస్థాపన

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలోని పాతపాళెంలో రామమందిరం నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి ఎమ్మెల్యే సోమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ రామ మందిరం నిర్మాణానికి కామన్ గుడ్ ఫండ్ ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జాఫర్ సాహెబ్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, తోటపల్లిగూడూరు సొసైటీ చైర్మన్ సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో మహాసమాధి మహోత్సవం

నెల్లూరు(బృందావనం):పద్మావతినగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో 107వ మహాసమాధి (ఆరాధన) మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. విజయదశమి నాడు సాయినాథుడి దివ్య సన్నిధిలో షిర్డీ సంప్రదాయరీతిలో పూజా కార్యక్రమాలు జరిగాయి. బాబా మహాసమాధి చెందిన మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో 306 జ్యోతుల ప్రజ్వలనను బాబిసాయి భక్తిప్రపత్తులతో నిర్వహించారు. రాత్రి సాయిసచ్చరిత్ర పారాయణం, పల్లకి ఉత్సవం నేత్రపర్వంగా జరిగాయి. సాయినాథుడు విశేష పుష్పాలంకరణలో భక్తులను కటాక్షించారు. విద్యుద్దీపాలంకరణలతో మందిరం శోభిల్లింది. ఆయా కార్యక్రమాల ఉభయకర్తలుగా మోదెం మల్లికార్జునరావు, భారతి, వేమూరు కిషోర్ కుమార్, నాగవెంకట అరుణలత, కనిశెట్టి సురేష్‌బాబు, సరస్వతి, సన్నపురెడ్డి సుకన్య వ్యవహరించారు. కార్యక్రమంలో మందిరం మేనేజింగ్‌ట్రస్టీ మధుసాయి, గౌరవ సలహాదారులు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పర్యవేక్షించారు. ముగింపు సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి సాయిసచ్చరిత్ర పూర్తి గ్రంథం అఖండ పారాయణం చేపట్టినట్లు మధుసాయి వెల్లడించారు.


సాయిబాబాకు 306 జ్యోతుల దివ్యనక్షత్ర హారతిస్తున్న బాబిసాయి

నత్తనడకన ఎన్ఎస్సార్ పథకం పనులు

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు
- కూటమి ప్రభుత్వం వచ్చాక కొరవడిన పర్యవేక్షణ
- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు
- త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి


నత్తనడకన సాగుతున్న పైపులైన్ పనులు

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: బుచ్చిరెడ్డిపాళెం పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. అందుకు తగినట్లుగా జనాభా సైతం పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణ జనాభా అవసరాల మేరకు పూర్తిస్థాయిలో రక్షిత మంచినీటిని అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అమృత్ 2.0 పథకం కింద రూ.85కోట్లతో ఎన్ఎస్సార్ తాగునీటి పథకం పనులకు శ్రీకారం చుట్టారు. అయితే పథకం పనులు మొదలై రెండేళ్లు గడుస్తున్నా కనీసం యాభైశాతం పనులు కూడా పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పథకం పనులపై పర్యవేక్షణ కొరవడంతోనే పనులు నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ ఏడాది పూర్తయ్యేనా..!

ఎన్ఎస్సార్ పథకం పనుల్లో భాగంగా సంగం మండలం సంగం బ్యారేజీ వద్ద నుంచి బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ వరకు పైపులైన్ ఏర్పాటు చేయాలి. అయితే ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఎన్నికలకు ముందు మొదలైన పైపులైన్ పనులు ఇంకా సగం కూడా పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఈ పథకంపై ఒక్కసారి కూడా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించలేదు. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. పైపులైన్ల పనులే ఇంకా పూర్తి కాలేదంటే ఇన్‌టేక్ వెల్స్, నీటిని శుద్ధి చేసే ప్లాంట్ల నిర్మాణం ఎప్పుడు మొదలుపెడతారో ఎవరికీ తెలియదు. ఈ ఏడాది పూర్తికావడానికి మరో మూడు నెలలు మాత్రమే సమయం ఉంది. దీంతో పనుల పూర్తి విషయమై సందిగ్ధత ఏర్పడింది. ఏ విధంగా చూసినా ఈ ఏడాది పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. దీంతో వచ్చే వేసవిలో కూడా పుర ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తప్పేలా లేవు.

చొరవ చూపని అధికారులు

పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్సార్ తాగునీటి పథకంపై జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పనులు ముందుకు సాగడంలేదు. దీంతో పథకం లక్ష్యం నీరుగారుతోంది. పవ్వేరు, ఆర్అండ్‌బీ బంగ్లా, వివేకానంద పాఠశాల, జొన్నవాడ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఐదు ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. ఈ పనులు పావుశాతం కూడా పూర్తవ్వలేదు. ఇదంతా ఒక ఎత్తయితే మున్సిపాలిటీలో సుమారు 10వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. ఈ పనులన్నీ పూర్తవ్వడానికి కనీసం ఏడాది సమయమైనా పట్టే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి సదుద్దేశంతో మంజూరు చేయించిన పథకాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రసన్నకు పేరొస్తుందనేనా..

ప్రసన్నకుమార్‌రెడ్డి తండ్రి నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి గతంలో మంత్రిగా పనిచేసిన సమయంలో జిల్లాకు తెలుగుగంగ ప్రాజెక్టును తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వ హయాంలో మంచినీటి పథకాన్ని మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి (ఎన్ఎస్సార్) తాగునీటి పథకంగా నామకరణం చేశారు. తండ్రి బాటలోనే ప్రసన్న బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీకి తాగునీటి పథకం తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పట్టణ ప్రజలకు 24 గంటలూ తాగునీరు అందుబాటులో ఉంటుంది. ప్రసన్న తీసుకొచ్చారనే కారణంగా ప్రస్తుత ఎమ్మెల్యే పథకం పనులను పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్క అభివృద్ధి పని చేయలేదు



కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాళెంలో చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి పనికూడా పూర్తి చేయలేదు. మా ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఎన్ఎస్సార్ తాగునీటి పథకాన్ని అయినా పూర్తిచేసి ప్రజలకు సురక్షిత మంచినీరు అందించేందుకు చర్యలు చేపట్టాలి.

– సీహెచ్ సతీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, బుచ్చిరెడ్డిపాళెం

మంచినీటి పథకాన్ని పూర్తి చేయాలి



మున్సిపల్ సమావేశం ఎప్పుడు జరిగినా పట్టణంలోని తాగునీటి సమస్యపై ప్రధానంగా చర్చ జరుగుతుంది. ఈ సమస్య తీరాలంటే మా నాయకుడు ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవచూపి తీసుకొచ్చిన మంచినీటి పథకాన్ని పూర్తిచేసి ప్రజల దాహార్తి తీర్చాలి.

– యానాదిరెడ్డి, కౌన్సిలర్, 12వ వార్డు

రైతు బజారులో గానుగ ప్రారంభం

పొదలకూరు : పట్టణంలోని రైతు బజారులో గానుగ యంత్రాన్ని పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్వచ్ఛమైన వేరుశనగ నూనె ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు.పొదలకూరు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలకు స్వచ్ఛమైన వేరుశనగ నూనెను అందించేందుకు లక్ష్మీ ఆయిల్ ట్రేడర్స్‌కు చెందిన రాజేశ్వరమ్మ గానుగను ఏర్పాటు చేశారని తెలిపారు. వేరుశనగ పప్పు కూడా రైతు బజారులోనే విక్రయించడం జరుగుతుందన్నారు. సోమశిల సాగునీటి సంఘం అధ్యక్షుడు కేశవులుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించడం అందరి బాధ్యత

నెల్లూరు(అర్బన్): వృద్ధులను ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి అన్నారు. శుక్రవారం నగరంలోని బీవీనగర్‌లో ఉన్న మదర్ థెరిసా వృద్ధుల ఆశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వాణి మాట్లాడుతూ తల్లిదండ్రులను, కుటుంబంలోని ఇతర వయో వృద్ధులను నిర్లక్ష్యం చేయడం హేయమైన చర్య అన్నారు. ఆధార్, రేషన్ కార్డులు లేని వారు తమకు తెలిపితే వాటిని అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కావలి ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విక్రమసింహ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివనమ్రత, ఆశ్రమ సిస్టర్ మోహిని, పారా లీగల్ వలంటీర్ పెంచల నరసయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి వాణి

⇨ మై భారత్ నెల్లూరు, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ)ల ఆధ్వర్యంలో శుక్రవారం బుజబుజనెల్లూరులోని వృద్ధుల ఆశ్రమంలో దుప్పట్లు, పండ్లు, మందులు పంపిణీ చేశారు. మైభారత్ యువజన అధికారి ఎ.మహేంద్రరెడ్డి, రసూల్, శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.